RNI-TELTEL/2017/72695

శుభ
# తెలంగాణ

13 జూలై 2023

గురువారం | మేడ్చల్
సంపుటి : 6, సంచిక :128
ఎడిటర్: ఎన్ సీ శేఖర్
వెల: 4 రూ/.
Website: www.subhatelangana.in

Published From Medchal, Circulated at Jagtial, Jangaon, Jayashankar, Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri, Bhuvanagiri.



# బీఆర్ఎస్ బెదురుదాడి!

## 24 గంటల ఉచిత విద్యుత్తుపై రేవంత్ వ్యాఖ్యల పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు

- రేవంత్, కాంగ్రెస్ దిష్టిబొమ్మల దహనం
- రాష్ట్రంలో కాంగ్రెస్ గ్రాఫ్ పెరుగుతున్నందుకే!
- వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే
- 24 గంటల ఉచిత విద్యుత్తు ఇచ్చేది మేమే: రేవంత్
- 24 గంటల విద్యుత్తును మేనిఫెస్టోలో పెడతాం
- కాంగ్రెస్ ఎప్పుడూ రైతులకు అండగానే: ఠాక్రే
- ఓటమి భయంతోనే బీఆర్ఎస్ రాద్ధాంతం
- 10 గంటలు ఇచ్చినట్లు నిరూపిస్తారా?: కోమటిరెడ్డి
- రైతుల పాలిట రాబందు రేవంత్‌రెడ్డి
- మూడు పంటల సీఎం కేసీఆర్ కావాలో
- 3 గంటల కాంగ్రెస్ కావాలో తేల్చుకోవాలి: కేటీఆర్
- రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలి: కవిత

**హైదరాబాద్(శుభ తెలంగాణ):** నిన్నటి దాకా కాంగ్రెస్ పేరు ఎత్తడానికి కూడా ఇష్టపడవి బీఆర్ఎస్.. ఒక్కసారిగా ఆ పార్టీని టార్గెట్ చేసింది. అధినేత నుంచి కింది స్థాయి కార్యకర్త దాకా కాంగ్రెసను లెక్కలోకి కూడా తీసుకోని అధికార పార్టీ.. ఇప్పుడు ఆ పార్టీపైనే విమర్శలు ఎక్కుపెట్టింది. కాంగ్రెస్ నేతలు చేసే వ్యాఖ్యలను ఏమాత్రం పట్టించుకోని గులాబీ దళం.. ఇప్పుడు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యల పేరుతో ధర్నాలు, దిష్టిబొమ్మల దహనాలు చేపట్టింది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ గ్రాఫ్ పెరుగుతోందన్న అభిప్రాయాల నేపథ్యంలోనే అధికార పార్టీ నేతలు తమ వైఖరి మార్చుకున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిన్నమొన్నటి దాకా రాష్ట్రంలో ఏ కార్యక్రమం జరిగినా బీఆర్ఎస్ నేతలు కేంద్రంలోని బీజేపీ పైనే విమర్శలు చేస్తూ వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇటీవలి పరిణామాలతో కమలనాథులు బలహీనపడగా, కాంగ్రెస్ మాత్రం నేతల చేరికలతో బలోపేతమవుతూ వస్తోంది. ఈ పరిణామంతో కాంగ్రెస్సే తమ ప్రత్యర్థి అని, తమ అధికారానికి ఆ పార్టీ నుంచే సవాలు ఎదురవుతోందనే విషయాన్ని గులాబీ శిబిరం గుర్తించిందని అంటున్నారు. అందుకే కాంగ్రెస్ విషయంలో ఏ చిన్న అవకాశం లభించినా వదులుకోవద్దనే ఉద్దేశంతోనే ఉచిత విద్యుత్తుపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యల పట్ల మంత్రుల నుంచి కింది స్థాయి నేతల దాకా అంతగా స్పందించారని చెబుతున్నారు. రేవంత్ వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం రెండో రోజు కూడా బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలు చేపట్టాయి.

వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయేనని, రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తు ఇచ్చేది కూడా కాంగ్రెస్ పార్టీయేనని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. కల్వకుంట్ల అన్నాచెల్లెళ్లు (కేటీఆర్, కవిత) "మూడు గంటలు" అంటూ దుష్ప్రచారం చేసినా, మూడు చెరువుల నీళ్లు తాగినా మూడోసారి వారు అధికారంలోకి రావడం కల్ల అని పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు రేవంత్ ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌కు జతగా.. "తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తు ఇస్తుంది. రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఏమి చెప్పిందో అవి అమలు చేస్తుంది. రైతులకు 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్తును అందిస్తుంది." అంటూ బుధవారం ఢిల్లీలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్‌రావు ఠాక్రే చేసిన ప్రకటనకు సంబంధించిన వీడియోను పోస్ట్ చేశారు. కాగా, తెలంగాణలో కాంగ్రెస్ గ్రాఫ్ వేగంగా పెరుగుతోందని, దానిని అడ్డుకునే కుట్రలో భాగంగానే బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మాణిక్‌రావు ఠాక్రే అన్నారు. బుధవారం ఆయన ఢిల్లీలో

వివరాలు 2లో..

# కేశవనగర్ బడిని చూస్తే కన్నీళ్లొచ్చాయ్



### మెట్లు సరిగాలేవు.. రాళ్ల మధ్యే ఆటలు

### బాలికల మరుగుదొడ్డి వద్ద పందులు

### ఈ స్థితి నేను ఎప్పుడూ ఎక్కడా చూడలే

### మా డ్రైవర్ చెబితే తప్ప బడి అని నమ్మలే

### బడి దత్తతకు స్ఫూర్తి తాతే: హిమాన్షు

**హైదరాబాద్(శుభ తెలంగాణ):** ముఖ్యమంత్రి కేసీఆర్ మనవడు, మంత్రి కేటీఆర్ కుమారుడు హిమాన్షురావు తీసుకున్న 'ఓ సంకల్పం' పూర్తయింది. హైదరాబాద్ గౌలిదొడ్డిలోని కేశవనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఆధునిక హంగులను సంతరించుకుంది. సౌకర్యాలలేమితో కునారిల్లుతున్న ఈ బడిని హిమాన్షు దత్తత తీసుకున్నారు. తాను సేకరించిన నిధులతో బడిని ఆధునికీకరించారు. బడిలో కొత్తగా కల్పించిన సౌకర్యాలను తన పుట్టిన రోజు సందర్భంగా బుధవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి హిమాన్షు ప్రారంభించారు.

వివరాలు 2లో..

## ఖబడ్దార్ రేవంత్.. నీకు పుట్టగతులుండవ్

**హైదరాబాద్(శుభ తెలంగాణ):** రేవంత్ వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా దుమారం రేగుతోంది. బీఆర్ఎస్ నేతలు ఆందోళనలు చేస్తున్నారు. రైతుల జోలికొస్తే పుట్టగతులుండవంటూ రేవంత్ రెడ్డిని హెచ్చరించారు మంత్రి మల్లారెడ్డి. మేడ్చల్

వివరాలు 2లో..



## బెంగళూరులో ప్రతిపక్ష పార్టీల భేటీకి సోనియా గాంధీ!



### ఈ నెల 17, 18వ తేదీల్లో సమావేశాలు

### 24 పార్టీలకు ఆహ్వానం

### గత నెల 23న బీహార్లో జరిగిన మొదటి సమావేశం

**హైదరాబాద్(శుభ తెలంగాణ):** కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియా గాంధీ ఈనెల 17, 18వ తేదీల్లో బెంగళూరులో జరిగే ప్రతిపక్ష నేతల తదుపరి సమావేశానికి హాజరవుతారని తెలుస్తోంది. దీనికి 24 పార్టీలను

వివరాలు 2లో..

## టీ కాంగ్రెస్ కొత్త వ్యూహం.. సెటిలర్స్, సినీ పరిశ్రమపై దృష్టి!

### కర్ణాటకలో విజయం, ఖమ్మం సభ సక్సెస్ తర్వాత కాంగ్రెస్ లో జోష్

### గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి ఖమ్మంలో కీలకం కానున్న సెటిలర్లు

### వారితో పాటు సినీ పరిశ్రమ పెద్దలు, కార్మికులను ఆకట్టుకోవాలని చూస్తున్న కాంగ్రెస్ నాయకత్వం



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** :తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న కొద్దీ ప్రధాన రాజకీయ పార్టీలు తమ వ్యూహాలు, అస్త్రాలకు పదును పెడుతున్నాయి. కర్ణాటక ఎన్నికల్లో ఘన విజయం, ఖమ్మంలో

వివరాలు 2లో..

## తమిళనాడు రాజకీయాల్లో ప్రకంపనలు..

### పాదయాత్రకు రెడీ అవుతున్న హీరో విజయ్!



- నిన్న తన అభిమాన సంఘం సభ్యులతో సమావేశమైన విజయ్
- ఈ సమావేశంలో పాదయాత్రకు సంబంధించిన నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం
- తన 'లియో' సినిమా విడుదలకు ముందే పాదయాత్ర చేపట్టే అవకాశం

వివరాలు 2లో..

## రాష్ట్ర ప్రజల గుండెల్లో కేవలం టీఎంసీ మాత్రమే ఉందని రుజువైంది

### పంచాయతీ గెలుపుపై మమతా బెనర్జీ



- బీజేపీ తమపై తప్పుడు ప్రచారం చేసిందని మమత ఆగ్రహం
- పార్టీ పట్ల ప్రజలు చూపుతున్న ప్రేమ, ఆప్యాయత, మద్ధతుకు ధన్యవాదాలు తెలిపిన సీఎం
- ఈ గెలుపు బెంగాల్ ప్రజలదేనని వ్యాఖ్య

వివరాలు 2లో..

## త్వరలోనే కొత్త ఇంటికి రాహుల్ గాంధీ!

- ఏప్రిల్‌లో ఎంపీగా అనర్హత వేటుకు గురైన రాహుల్ గాంధీ
- తన అధికారిక నివాసం నుంచి ఖాళీ చేసి తల్లి వద్దకు
- నిజాముద్దీన్ ఈస్ట్ బీ2లో ఉన్న ఫ్లాట్‌కు వెళ్లాలని నిర్ణయం!
- గతంలో ఇదే ఇంట్లో ఉన్న ఢిల్లీ మాజీ సీఎం షీలా దీక్షిత్



వివరాలు 2లో..

## కల్వకుంట్ల అన్నాచెల్లెళ్లు దుష్ప్రచారం చేస్తున్నారు

### ఉచిత విద్యుత్‌పై వ్యాఖ్యల వివాదం.. రేవంత్ రెడ్డి ట్వీట్!



- 3 చెరువుల నీళ్లు తాగినా బీఆర్ఎస్ అధికారంలోకి రాదని వ్యాఖ్య
- రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చేది కాంగ్రెస్సేనని వెల్లడి

వివరాలు 2లో..

## తిరుమలలో మరోసారి చిరుత సంచారం కలకలం రేపింది



- ఘాట్ రోడ్డు 56వ మలుపు వద్ద కనిపించిన చిరుత
- వాహనదారులను గుంపులుగా పంపిస్తున్న అధికారులు
- చిరుతను దారి మళ్లించే ప్రయత్నం చేస్తున్న టీటీడీ

56 క్రాస్ వద్ద తిరుమల ఘాట్‌లో చిరుతపులి

వివరాలు 2లో..

# బీఆర్ఎస్ బెదురుదాడి!

- మొదటి పేజీ తరువాయి

విలేకరులతో మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్తుపై అమెరికాలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ పార్టీ వక్రీకరించిందన్నారు. రాష్ట్రంలో 24 గంటల ఉచిత విద్యుత్తు హామీని తమ మేనిఫెస్టోలో పొందుపరుస్తామని ప్రకటించారు. తెలంగాణ రైతుల కోసం రాహుల్‌గాంధీ వరంగల్‌లో రైతు డిక్లరేషన్ ప్రకటించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఎప్పుడూ రైతులకు అండగానే నిలుస్తుందని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పథకాలను పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుందని పేర్కొన్నారు.

**పది గంటలు కరెంటు ఇచ్చినట్లు నిరూపించు**

"రాష్ట్రంలో ఏ సబ్ స్టేషన్‌కైనా వెళదాం. రైతులకు పది గంటలు నిరంతరాయంగా కరెంటు ఇచ్చినట్లు నిరూపిస్తే నేను అక్కడే నా ఎంపీ పదవికి రాజీనామా చేస్తాను. లేకపోతే నువ్వు అక్కడే మంత్రి పదవికి రాజీనామా చేస్తావా?" అని మంత్రి కేటీఆర్‌కు కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్ విసిరారు. కేసీఆర్ నినాదమైన మూడు పంటలు కావాలా? లేక కాంగ్రెస్ నినాదమైన మూడు గంటల కరెంట్ కావాలా? రైతులే తేల్చుకోవాలంటూ మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్‌పై కోమటిరెడ్డి స్పందించారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయమన్న భయంతోనే.. రేవంత్‌రెడ్డి మాటలను వక్రీకరించి రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల తర్వాత కల్వకుంట్ల కుటుంబం.. నీరవ్ మోదీ, విజయ్ మాల్యా మాదిరిగా లండన్‌కో, దుబాయికో పారిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. విద్యుత్తు శాఖలో వృద్ధులైన అధికారులు పని చేస్తున్నారని, విద్యుత్తు శాఖ మంత్రికి ఎలాంటి పవర్స్ లేవని ఎద్దేవా చేశారు. మరోవైపు బీఆర్ఎస్ తీరు పట్ల కాంగ్రెస్ సీనియర్ నేతలు పలువురు తీవ్రంగా మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందంలో భాగంగానే రేవంత్ వ్యాఖ్యల వక్రీకరణకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

**రైతులంటే ఎందుకింత కడుపుమంట?**

రైతులంటే కాంగ్రెస్ పార్టీకి ఎందుకంత కడుపు మంట? అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని విద్యుత్ సౌధ ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు నిర్వహించిన ధర్నాలో ఆమె పాల్గొన్నారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మూడు పూటలు అన్నం పెట్టే రైతులకు మూడు గంటలు కరెంట్ చాలునన్న రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆయనను గ్రామాల్లో తిరగనివ్వబోమన్నారు. 60 ఏళ్లలో టీడీపీ, కాంగ్రెస్ పార్టీలో రేవంత్‌రెడ్డి ఉన్నారని, ఆ రెండు పార్టీలు రైతులకు సరైన విద్యుత్తు ఇవ్వలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి విద్యుత్తు వ్యవస్థను బలోపేతం చేసుకున్నామని తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు ఎందుకంటున్న రేవంత్‌రెడ్డి.. పరిశ్రమలకు, వ్యాపారవేత్తలకు కూడా ఇవ్వొద్దని చెప్పగలరా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి గ్రామాల్లోకి వస్తే రైతులు పొలిమేర దాకా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రేవంత్ వ్యాఖ్యలు చూస్తుంటే రాహుల్‌గాంధీ ప్రకటించిన రైతు డిక్లరేషన్ బోగస్ అని తెలుస్తోందన్నారు.

**రేవంత్ వ్యాఖ్యలు రైతులను అవమానించడమే**

"నిన్న ధరణిని తీసేస్తానన్న రాబందు.. నేడు మూడు గంటల కరెంటు చాలంటున్నాడు" అని మంత్రి కేటీఆర్.. రేవంత్‌రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇది రైతులకు రెండో ప్రమాద హెచ్చరిక అని ట్విటర్‌లో పేర్కొన్నారు. నాడు చంద్రబాబు వ్యవసాయం దండగ అన్నారని, నేడు మూడు పూటలు విద్యుత్తు దండగ అని చోటా చంద్రబాబు అంటున్నారని రేవంత్ రెడ్డిని ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. ఇది ముమ్మాటికీ సన్న, చిన్నకారు రైతును అవమానించడమేనని మండిపడ్డారు. కాంగ్రెసకు ఎప్పుడూ చిన్నకారు రైతు అంటే చిన్నచూపు, సన్నకారు రైతు అంటే సవతిప్రేమ అంటూ విమర్శించారు. నోట్లు తప్ప రైతుల పాట్లు తెల్వని రాబందును నమ్మితే రైతు నోట్లో మట్టికొట్టడం ఖాయమన్నారు. "కేసీఆర్ నినాదం మూడు పంటలైతే, కాంగ్రెస్ విధానం మూడు గంటలు, బీజేపీ విధానం మతం పేరిట మంటలు" అని కేటీఆర్ పేర్కొన్నారు.

**గోడలకు సున్నాలేసే వాడికి ఏం తెలుసు?**

గోడలకు సున్నాలేసే వాడికి రైతుల బాధలేం తెలుసునంటూ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్.. రేవంత్‌రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం మంచుకొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉచిత విద్యుత్తుపై రేవంత్‌రెడ్డి నిరాధారణ ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేయగా.. అందుకు పోలీసు అధికారులు సహకరించడం చర్చనీయాంశమైంది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు. రైతుల పొట్టకొట్టాలని కాంగ్రెస్ చూస్తోందని ఆరోపించారు. నిజామాబాద్ జిల్లాల్లోనూ అన్ని మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ శ్రేణులు రేవంత్ దిష్టిబొమ్మలను దహనం చేశాయి. మోర్తాడ్ మండలం దొన్కల్‌లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంపై కనీస అవగాహన లేనివారికి అవకాశం కల్పిస్తే నష్టపోయేది రైతులేనని హెచ్చరించారు. రైతులకు 24 గంటల కరెంటు ఇస్తుంటే కాంగ్రెసకు కళ్లు మండుతున్నాయని మంత్రి వి.శ్రీనివాసగౌడ్ ఆరోపించారు. రేవంత్ వ్యాఖ్యలకు నిరసనగా గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తా వద్ద పార్టీ శ్రేణులతో కలిసి మంత్రి రాస్తారోకో చేశారు. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్‌లో మంత్రి మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేపట్టగా, ఇతర ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఉమ్మడి వరంగల్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోనూ నిరసనలు చేపట్టారు. కాగా, కాంగ్రెస్, బీజేపీలు రైతులపై కక్షగట్టాయని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం అన్నారు. రేవంత్ వ్యాఖ్యలను ఖండిస్తూ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

**పోటాపోటీ నిరసనలు**

రంగారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటాపోటీగా నిరసనలకు దిగాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల విద్యుత్తు పేరుతో రైతులను మోసం చేస్తోందని, రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి రైతులను రెచ్చగొడుతోందంటూ డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యుత్తు సబ్‌స్టేషన్ల ముందు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కాగా, కామారెడ్డి జిల్లా భిక్కనూరులో తొలుత బీఆర్ఎస్ నేతలు సినిమా టాకీస్ చౌరస్తాకు చేరుకొని రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేయగా, అదే సమయంలో కాంగ్రెస్ నాయకులు అక్కడికి చేరుకుని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఇరు పార్టీల నాయకులు పోటాపోటీ నినాదాలు చేసుకొని ఘర్షణకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకొని సర్దిచెప్పి పంపించడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఖమ్మం జిల్లాలోని తల్లాడలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు నిరసన తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ ముఖ్య నేతల ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. హసన్‌పర్తిలో హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, భూపాలపల్లిలో గండ్ర సత్యనారాయణరావు, వరంగల్‌లో టీపీసీసీ కార్యదర్శి అయూబ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు.

## కల్వకుంట్ల అన్నాచెల్లెళ్లు దుష్ప్రచారం చేస్తున్నారు

హైదరాబాద్ : తెలంగాణలో 95 శాతం మంది చిన్న, సన్నకారు రైతులేనని, 3 ఎకరాల్లో వ్యవసాయం చేసే రైతుకు 3 గంటల విద్యుత్ చాలని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. మొత్తంగా 8 గంటల ఉచిత విద్యుత్ ఇస్తే సరిపోతుందని.. కేవలం విద్యుత్ సంస్థల కమీషన్లకు కక్కుర్తి పడి వ్యవసాయానికి 24 గంటల కరెంట్ అనే నినాదం తీసుకొచ్చారని రేవంత్ చెప్పడంపై బీఆర్ఎస్ తీవ్రంగా మండి పడింది. ఈ రోజు తెలంగాణవ్యాప్తంగా నిరసనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో తన వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. "కల్వకుంట్ల అన్నా చెల్లెళ్లు 'మూడు గంటలు' అని దుష్ప్రచారం చేసినా, మూడు చెరువుల నీళ్లు తాగినా.. మీరు మూడోసారి అధికారంలోకి రావడం కల్ల" అని పేర్కొన్నారు. "వచ్చేది కాంగ్రెస్.. రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇచ్చేది కాంగ్రెస్" అని రేవంత్ చెప్పారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తామంటూ కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జ్ మాణిక్ రావ్ ఠాక్రే మాట్లాడుతున్న వీడియోను ట్వీట్‌కు జత చేశారు. బైబై కేసీఆర్ హ్యాష్ ట్యాగ్‌ను జతచేశారు.

## టీ కాంగ్రెస్ కొత్త వ్యూహం.. సెటిలర్స్, సినీ పరిశ్రమపై దృష్టి!

- మొదటి పేజీ తరువాయి

రాహుల్ గాంధీ సభ సక్సెస్ తర్వాత కాంగ్రెస్ పార్టీ జోష్ లో కనిపిస్తోంది. రాబోయే ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా ఆ పార్టీ అధి నాయకత్వం సరికొత్త వ్యూహంతో ముందుకొస్తోంది. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సెటిలర్స్ అంశాన్ని మరోసారి తెరపైకి తీసుకురావాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. గత రెండు ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు ప్రాంతాలు, ఆంధ్రతో సరిహద్దు పంచుకుంటున్న ఖమ్మంలో ఎక్కువగా ఉన్న ఆంధ్ర సెటిలర్లతో పాటు సినీ పరిశ్రమకు చెందిన వారిని తమవైపునకు తిప్పుకునేందుకు టీకాంగ్రెస్ ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్టు సమాచారం. గులాబీ పార్టీ నేతల వైఖరిపై ఆంధ్ర సెటిలర్స్‌లో ఓ వర్గం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టుగా ప్రచారం జరుగుతోంది. దీన్ని తమకు అనుకూలంగా మలుచుకోవాలని హస్తం నాయకులు చూస్తున్నారు. రానున్న ఎన్నికల్లో సెటిలర్స్‌కు ప్రాధాన్యత ఇచ్చేలా నాయకులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయా ప్రాంతాల్లోని సెటిలర్స్‌తో చర్చలు జరుపుతున్నారు. మరోవైపు సినీ ఇండస్ట్రీలోని కార్మికుల సమస్యల పరిష్కారంపై స్పష్టమైన వైఖరిని తీసుకోవడం, గతంలో సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వివరించే ప్రయత్నం కూడా చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సినీ పరిశ్రమ లేదంటే సెటిలర్స్ నుంచి మంత్రివర్గంలో ఒకరికి చోటు కల్పించాలన్న ఆలోచన కూడా చేస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. అదే విషయాన్ని సెటిలర్స్, సినీ పరిశ్రమ వారికి చేరవేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అంటున్నారు.

## కేశవనగర్ బడిని చూస్తే కన్నీళ్లొచ్చాయ్

- మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హిమాన్షు భావోద్వేగంగా ప్రసంగించారు. తాను తొలిసారిగా ఈ బడిని సందర్శించినప్పుడు సౌకర్యాల లేక అస్తవ్యస్తంగా ఉన్న పరిస్థితులను చూసి ఎంతో బాధపడ్డానని.. కళ్లలోంచి నీళ్లొచ్చాయని హిమాన్షు పేర్కొన్నారు. బడి అన్నాక కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకపోతే ఎలా? అనే భావన మెదిలి తన మనసు చలించిపోయిందన్నారు. ఆ రోజు తాను బడిలో చూసిన పరిస్థితులను ఆయన కళ్లకు కట్టినట్లు వివరించారు. అప్పట్లో మరగుదొడ్డి వసతి సరిగా లేదని.. బాలికల మరుగుదొడ్డి పరిసరాల్లోనైతే పందులు తిరుగుతుండటాన్ని చూశానని, పిల్లలు అక్కడికి ఎలా వెళ్లగలుతారోనని ఆలోచిస్తే ఎంతో బాధ కలిగిందని చెప్పారు. బడి పిల్లలు ప్రమాదకర స్థితిలో రాళ్ల మధ్య పరుగెత్తారని.. ఆ రోజే ఓ బాలుడికి దెబ్బ తగిలిందని చెప్పారు. బడిలో మెట్లు కూడా సరిగా లేకుండెనని గుర్తుచేసుకున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే అక్కడికి వెళ్లాక తన వాహన డ్రైవర్ చెబితే తప్ప అది పాఠశాల అని తాను నమ్మలేకపోయానన్నారు. బడి అంతా కలియతిరిగి తరగతి గదులు, స్టేషనరీ, ఫర్నిచర్ పరిశీలించానన్నారు. ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడాలని అడిగి.. ఆయనతో కలిసి ఆఫీసు రూంలోకి వెళ్లానని అక్కడ విద్యార్థులంతా కూర్చుని ఉండటాన్ని చూసి ఆశ్చర్యపోయానని చెప్పారు. "మీ ఆఫీసు రూమ్‌లో విద్యార్థులు ఉన్నారేమిటి? సార్?" అని తాను ప్రధానోపాధ్యాయుడిని అడిగితే.. "సార్.. ఇదే మా ఆఫీస్ రూమ్, స్టాఫ్ రూమ్, క్లాస్ రూమ్.. స్టోర్ రూమ్" అని ఆయన చెప్పారని.. ఇది తనకు షాక్‌కు గురిచేసిందని హిమాన్షు వివరించారు.

ప్రైవేటు పాఠశాలలో చదువుకున్న తనకు ప్రభుత్వ బడిలోని హెడ్మాస్టర్ గది స్థితిని చూసి మాటల్లో చెప్పలేనంత బాధ కలిగిందని.. ఇట్లాంటివి తాను ఇంతకుమందెప్పుడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల స్థితి చూశాక.. బడి ఆధునికీకరణలో భాగంగా ఏవో గోడలు కట్టిస్తే సరిపోదని.. చాలా పనే చేయాల్సి ఉందని అమ్మ శైలిమకు చెప్పానని, అంత ఫండ్ రాలేదని ఆమె నాతో అన్నారుని వెల్లడించారు. తాను రూ.40 లక్షల దాకా సేకరించానని.. వీటికి తోడు డీఈసీ ఇన్‌ఫ్రా మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌గుప్తా సహకరించడంతో ఆధునికీకరణ పనులు పూర్తిచేశామని చెప్పారు. డైనింగ్ హాల్, బాలికలు, బాలురకు వేర్వేరు మరుగుదొడ్లు, నీటి సౌకర్యం, ఆధునిక తరగతి గదులు, పాఠశాలకు డిజిటల్ నేమ్‌బోర్డు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. నాన్న కేటీఆర్, ఆయన బృందం సహకారంతో పనులను విజయవంతంగా పూర్తిచేశామన్నారు. ఈ బడిని దత్తత తీసుకోవడానికి ప్రధాన స్ఫూర్తి తన తాత కేసీఆరేనని చెప్పారు. చదువుకున్న సమాజంతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన ఎప్పుడూ చెబుతుంటారని.. ఆ మాటలతోనే తాను ముందుకు సాగానని పేర్కొన్నారు. అంతకుముందు తన పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థుల సమక్షంలో హిమాన్షు కేక్ కట్ చేశారు. విద్యార్థులకు స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం పిల్లలతో కలిసి భోజనం చేశారు.

**వృద్ధులకు పాదాభివందనం చేసి..**

హిమాన్షు బుధవారం మధురానగర్‌లోని స్టేట్‌హోంకు వెళ్లారు. అక్కడ అనాథ చిన్నారుల మధ్య జన్మదిన వేడుకలను జరుపుకొన్నారు. అక్కడ అవిభక్త కవలలు వీణ వాణితో పాటు అనాథ చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. స్వయంగా తానే పిల్లలకుతినిపించి, కానుకలు అందజేశారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్దతూప్ర సమీపంలో ఉన్న మరియా వృద్ధాశ్రమానికి హిమాన్షు వెళ్లారు. అక్కడ వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేశారు. వృద్ధుల కాళ్లు మొక్కి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన అర్చక బృందం బుధవారం హిమాన్షుకు స్వామివారి ఆశీస్సులు అందజేసింది. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌కు వెళ్లి దేవస్థాన ప్రధానార్చకులు లక్ష్మీనరసింహాచార్యులు, వేదపండితులు శ్రీనివాస శర్మ, పవన్ కుమార శర్మ, సీతారామాచార్యులు హిమాన్షుకు ఆశీస్సులు, ప్రసాదాలు అందజేశారు.

**హిమాన్షు ప్రసంగంపై సోషల్ మీడియాలో వ్యాఖ్యలు**

బడుల దుస్థితికి హిమాన్షు వ్యాఖ్యలే నిదర్శనం'కేశవనగర్ పాఠశాల దుస్థితిని వివరిస్తూ సీఎం కేసీఆర్ మనవడు హిమాన్షు చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్దఎత్తున చర్చనీయాంశం అయ్యాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల దుస్థితిని సాక్షా త్తు ముఖ్యమంత్రి మనవడు చెప్పకనే చెప్పారంటూ కొందరు పేర్కొన్నారు. ఓ బడిలోని ఇబ్బందులను హిమాన్షు భావోద్వేగంతో చెప్పడం ప్రభుత్వ పాలనకు అద్దం పడుతోందని పలువురు నెటిజన్లు వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానివి మాటలే తప్ప చేతలు లేవని మరోసారి స్పష్టమైందని విమర్శించారు. ప్రైవేటు వ్యక్తులు ఇచ్చిన నిధులతో ప్రభుత్వ పాఠశాలను బాగు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని మరికొందరు ప్రస్తావించారు. "మన ఊరు- మన బడి" పేరిట ప్రభుత్వం పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని, విద్యా వ్యవస్థను ఎంతో బాగు చేశామని చెబుతున్నదంతా ప్రచార పటాటోపమేనని విమర్శించారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లలో చేసింది ఇదేనా..? అంటూ ఇంకొందరు ప్రశ్నించారు. రాష్ట్ర రాజధానిలో, ఐటీ కారిడార్‌లోని ప్రభుత్వ పాఠశాలలోనే కనీస సౌకర్యాలు కరువయ్యాయంటే.. మారుమూల పల్లెల్లోని విద్యా సంస్థల్లో ఇంకెన్ని సమస్యలు ఉంటాయో ఇట్టే చెప్పవచ్చని పేర్కొన్నారు.

### త్వరలోనే కొత్త ఇంటికి రాహుల్ గాంధీ!

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కొత్త ఇంటికి మారబోతున్నట్టు తెలుస్తోంది. దక్షిణ ఢిల్లీలోని నిజాముద్దీన్ ఈస్ట్ బీ2 ప్రాంతంలోని త్రీ బెడ్రూమ్ ఫ్లాట్‌కు వెళ్లే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఈ ఇంట్లో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ ఉండేవారు. ఇప్పుడు ఇదే ఆయన నివాసం కానున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. మార్చిలో ఎంపీగా తనపై అనర్హత వేటు పడటంతో ఏప్రిల్ 22న రాహుల్ గాంధీ అధికారిక బంగ్లాను ఖాళీ చేసిన విషయం తెలిసిందే. దీంతో వేలాది మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తమ ఇల్లు ఇస్తామంటూ ఆయనకు చెప్పారు. అయితే రాహుల్ మాత్రం తన తల్లి సోనియా గాంధీ వద్ద ఉంటున్నారు. నాటి నుంచి ఇంటి కోసం వెతుకుతున్న రాహుల్.. ఇకపై నిజాముద్దీన్ ఈస్ట్‌లోని ఇంటికి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. త్రీ బెడ్రూమ్ ఫ్లాట్‌లో 1991 నుంచి 1998 దాకా షీలా దీక్షిత్ ఉన్నారు. సీఎంగా, గవర్నర్ గా పని చేసిన సమయంలో ప్రభుత్వ అధికారిక నివాసాల్లో ఉన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత.. 2015లో తిరిగి ఈ ఫ్లాట్‌కి వచ్చారు. చనిపోయే దాకా ఆమె అక్కడే ఉన్నారు.

## బెంగళూరులో ప్రతిపక్ష పార్టీల భేటీకి సోనియా గాంధీ!

- మొదటి పేజీ తరువాయి

ఆహ్వానించినట్లు సమాచారం. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఐక్యతను పెంపొందించడానికి ప్రతిపక్ష పార్టీల మొదటి సమావేశం గత నెల 23న బీహార్‌లోని పాట్నాలో జరిగింది. తదుపరి బెంగళూరులో 17వ తేదీన అనధికారిక సమావేశంలో కీలక నేతలు భేటీ కానున్నారు. ఆ మరుసటి రోజు వీరిమధ్య అధికారిక చర్చలు జరగనున్నాయి. ఈ సమావేశంలో రాబోయే ఎన్నికల్లో ఎలాంటి వ్యూహంతో ముందుకెళ్లాలనే దానిపై పార్టీల మధ్య విస్తృత అంగీకారానికి సంబంధించిన అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. ొలి సమావేశంతో పోలిస్తే దక్షిణాదికి చెందిన ఎనిమిది కొత్త పార్టీలు ఈ భేటీలో పాల్గొననున్నాయి. వాస్తవానికి ప్రతిపక్ష పార్టీల భేటీ ఈ నెల 13నే జరగాల్సి ఉంది. కానీ, మహారాష్ట్రలో శరద్ పవార్‌పై అజిత్ పవార్ తిరుగుబాటు చేయడంతో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ)లో చీలిక తర్వాత ఈ సమావేశం ఈ నెల 17కి వాయిదా పడింది.కాగా, పాట్నాలో జరిగిన మొదటి సమావేశంలో 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఐక్యంగా ఎదుర్కోవాలని 15 ప్రతిపక్ష పార్టీలు నిర్ణయించుకున్నాయి. అయితే, ఆమ్ ఆద్మీ పార్టీ చివరి నిమిషంలో ఆ సమావేశానికి దూరం అవడంతో కూటమిలో ఆదిలోనే విభేదాలు బయటడ్డాయి. భవిష్యత్తులో ఢిల్లీ ఆర్డినెన్స్‌పై కాంగ్రెస్ బహిరంగంగా మద్దతు ప్రకటిస్తేనే తాము భేటీకి హాజరవుతామని ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు.

## రాష్ట్ర ప్రజల గుండెల్లో కేవలం టీఎంసీ మాత్రమే ఉందని రుజువైంది

పశ్చిమ బెంగాల్ పంచాయతీ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. ఈ గెలుపుపై ఆ పార్టీ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బుధవారం స్పందించారు. పంచాయతీ ఎన్నికల్లో తమను గెలిపించినందుకు బెంగాల్ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ తమపై తప్పుడు ప్రచారం చేసిందన్నారు. తమ గెలుపుకు తోడ్పడిన ప్రతిపక్షాలకూ థ్యాంక్స్ చెప్పారు. ఫేస్ బుక్‌లోను ఆమె ఓ పోస్ట్ పెట్టారు. గ్రామీణ బెంగాల్ టీఎంసీదేనని, పార్టీ పట్ల ప్రజలు చూపుతున్న ప్రేమ, ఆప్యాయత, మద్దతుకు ధన్యవాదాలు అన్నారు. రాష్ట్ర ప్రజల గుండెల్లో కేవలం టీఎంసీ మాత్రమే ఉందని ఈ పంచాయతీ ఎన్నికలు రుజువు చేశాయన్నారు. ఈ గెలుపు బెంగాల్ ప్రజలదే అన్నారు. కాగా, బెంగాల్ పంచాయతీ ఎన్నికల్లో 63,229 గ్రామపంచాయతీలకు గాను నేటి ఉదయం ఎనిమిది గంటల వరకు 34,359 స్థానాల్లో తృణమూల్ విజయం సాధించింది. 752 చోట్ల ముందంజలో ఉంది. 9,545 గ్రామపంచాయతీలను గెలుచుకొని బీజేపీ రెండో స్థానంలో ఉంది. కమలం పార్టీ 180 చోట్ల రెండో స్థానంలో ఉంది. సీపీఐ(ఎం) 2885 స్థానాలు గెలిచి, 96 చోట్ల ముందంజలో, కాంగ్రెస్ 2,498 చోట్ల గెలిచి, 72 స్థానాల్లో ముందంజలో వున్నాయి. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ... ఇప్పటికే ఎన్నికలు ఒక ప్రహసనంగా మారాయని చెప్పవచ్చునని, ఈ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే భయంకరమైన పరిస్థితిని చూశారన్నారు. ఎన్నికల సమయంలో దారుణ హింస చోటు చేసుకుందని, దీంతో 40 మంది వరకు మృతి చెందారన్నారు. అధికార పార్టీ, పోలీసులు మధ్య అనుబంధం వెల్లడైందని, బెదిరింపులు చోటు చేసుకున్నాయన్నారు.

## తిరుమలలో మరోసారి చిరుత సంచారం కలకలం రేపింది

తిరుమలలో మరోసారి చిరుత సంచారం భక్తులకు ఆందోళన కలిగిస్తోంది. ఘాట్ రోడ్డులోని 56వ మలుపు వద్ద కనిపించింది. అప్రమత్తమైన అధికారులు వాహనదారులను గుంపులుగా పంపుతున్నారు. చిరుతను దారి మళ్లించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల అలిపిరి నడక దాడిలో ఓ చిన్నారిపై చిరుత దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన మరవకముందే ఇప్పుడు చిరుత కనిపించింది. ఇటీవల కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన నాలుగేళ్ల కౌశిక్ ను చిరుత నోట కరిచి తీసుకెళ్లింది. పోలీస్ ఔట్ పోస్ట్ వద్ద బాలుడిని విడిచిపెట్టింది. ఈ ఘటనలో బాలుడి చెవి వెనుక, తలపై గాయాలయ్యాయి.

### తమిళనాడు రాజకీయాల్లో ప్రకంపనలు.. పాదయాత్రకు రెడీ అవుతున్న హీరో విజయ్!

తమిళ స్టార్ హీరో విజయ్ రాజకీయరంగ ప్రవేశానికి సంబంధించిన విషయం ఆ రాష్ట్రంలో ఎప్పుడూ హాట్ టాపిక్ గానే ఉంటుంది. తాజాగా విజయ్ కు సంబంధించిన ఒక వార్త ప్రకంపనలు పుట్టిస్తోంది. త్వరలోనే ఆయన పాదయాత్ర చేయబోతున్నారనే ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది. తన అభిమాన సంఘం 'విజయ్ మక్కల్ ఇయక్కం' సభ్యులతో విజయ్ తరచుగా సమావేశమవుతుంటారు. నిన్న కూడా వారితో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాదయాత్రకు సంబంధించిన నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. తన తాజా చిత్రం 'లియో' విడుదల కంటే ముందుగానే తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేయాలనుకుంటున్నారని తెలుస్తోంది. ఈ చిత్రం అక్టోబర్ 19న విడుదల కానుంది. ఈ లోగానే తన నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించనున్నారని సమాచారం. మరోవైపు ఇటీవలే విజయ్ రాష్ట్రంలోని నియోజకవర్గాల వారీగా టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులను సన్మానించారు. చెన్నైలో జరిగిన ఈ కార్యక్రమంలో మెరిట్ విద్యార్థులకు సర్టిఫికెట్స్, నగదు ప్రోత్సాహాన్ని అందించారు. ఇదంతా కూడా రాజకీయ అరంగేట్రంలో భాగమేనని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

### ఖబడ్దార్ రేవంత్.. నీకు పుట్టగతులుండవ్

- మొదటి పేజీ తరువాయి

పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ అధ్వర్యంలో రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు బీఆర్ఎస్ నేతలు. ఈ నిరసనలో మల్లారెడ్డితో పాటు మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.రేవంత్ రెడ్డి ఓ బ్లాక్ మెయిలర్ అని.. అతనో దగాకోరని ధ్వజమెత్తారు మల్లారెడ్డి. డబ్బుల కలెక్షన్ల కోసమే రేవంత్ అమెరికా వెళ్లిందని ఆరోపించారు. కాంగ్రెస్ దివాలా తీసిందని.. రేవంత్ దివాలా తీసిన పార్టీకి పీసీసీ చీఫ్ అని మండిపడ్డారు. పీసీసీ చీఫ్ పదవిని ఆయన సీఎం పదవిలా ఫీలవుతుండని విమర్శించారు. రేవంత్ రెడ్డిని నమ్మొద్దని.. కాంగ్రెస్ రైతులను మోసం చేస్తదన్నారు. కేసీఆర్ రైతుల మేలు కోరేవారని..బీఆర్ఎస్ ది రైతు సర్కార్ అని అన్నారు.

శుభ తెలంగాణ
RNI-TELTEL/2017/72695
ఉన్నది ఉన్నట్టుగా రాసే తెలుగు దినపత్రిక
గురువారం | మేడ్చల్
13 జూలై 2023
www.subhatelangana.in


# ప్రభుత్వం పద్మశాలీలను ఆదుకోవాలి....

**ఊట్కూర్, జులై 12, (శుభ తెలంగాణ)** తెలంగాణ రాష్ట్రంలో పద్మశాలి కులస్తులు ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా వెనుకబడి ఉన్నారని ప్రభుత్వం వారిని ఆదుకోవాలనితెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం జిల్లా నాయకులు బోర్ల శివాజీ కోరారు.బుధవారం మండల కేంద్రము ఊట్కూర్ లో పద్మశాలి సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కుల వృత్తుల వారికి అందిస్తున్న లక్ష రూపాయల ఆర్థిక సహాయం లో పద్మశాలి కులస్తులకు అవకాశం కల్పించాలని కోరారు. చేనేత కార్మికులకు రైతుబంధు తరహాలో చేనేత బందును ప్రకటించాలని కోరారు. బ్యాంకుల ద్వారా ప్రత్యేక రుణాలను అందించాలని అన్నారు. అంతకుముందు పగగడిమారి గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు యంగలి కృష్ణ మీనన్, ఏర్పుల మనోహర్, భోగం లక్ష్మీనారాయణ, యంగలి శ్యామ్ రావు , విఠోబ, గోరంట్ల ఆనంద్, యంగలి రేణుక, యంగలి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు



# అర్హులను గుర్తించేందుకు జగనన్న సురక్ష పథకం: బుర్ర మధుసూధన్ యాదవ్




**హైదరాబాద్(శుభ తెలంగాణ):** కుల,మత, పార్టీ లకు అతీతంగా ప్రతి ఒక్కరికి మంచి చేయాలన్న సదుద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమంను చేపట్టారని కనిగిరి శాసన సభ్యులు బుర్రా మధుసూధన్ యాదవ్ పేర్కొన్నారు. కనిగిరి టౌన్ లో 11వార్డ్ లోని 7వ సచివాలయం పరిధి లో 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు బుర్ర మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు జన్మభూమి కమిటీలతో ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి ధన దోపిడీ కి ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, మరీ ముఖ్యంగా సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చి ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలను అందిస్తున్న గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులు దాదాపు పరిష్కరించామని తెలిపారు. జనన, మరణ, కుల, వివాహ ధ్రువీకరణ పత్రాలు వంటి 11 రకాల సేవలను 'జగనన్న సురక్ష' ద్వారా ఉచితంగా ప్రజలకు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇంత మంచి చేస్తుంటే, ఎక్కడ జగన్మోహన్ రెడ్డి కి మంచి పేరు వస్తుందోనన్న దురుద్దేశ్యం తో ప్రభుత్వం పై అసత్య ప్రచారాలతో ప్రతిపక్ష పార్టీలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు 14 సంవత్సరాలు ముఖ్యమంత్రి గా పని చేసినా ప్రజల గురించి ఏనాడు ఆలోచించింది లేదన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ రూ.2 కే కిలో బియ్యం అందిస్తే, చంద్రబాబు అధికారంలోకి వచ్చాక దానిని రూ.5.25 చేసిన ఘనుడు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. 2014 ఎన్నికల్లో 600 హామీలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఇచ్చిన హామీల మ్యానిఫెస్టోనే కనుమరుగు చేశాడని గుర్తు చేశారు. ఇప్పుడు మరీ ఎన్నికలొస్తున్నాయని మినీ మ్యానిఫెస్టో తో మరోమారు ప్రజలను మోసం చేయడానికి టిడిపి నాయకులు వస్తున్నారని, వారి మాటలను ఎవ్వరు నమ్మేస్థితిలో లేరని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమం తో పాటు అభివృద్ధి కి కూడా పెద్ద పీట వేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు రంగనాయకుల రెడ్డి,మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్,మున్సిపల్ కమిషనర్,వైస్ చైర్మన్ పులి శాంతి,కౌన్సిలర్ లు, అధికారులు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు,వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# కొండవీడు అగడ్తను మింగేసి మంత్రి రజిని రూ.20 కోట్ల దోపిడీ

**టోల్‌గేట్ వసూలు తప్ప కొండవీడు కోటకు వైకాపా చేసిందేమీ లేదు**

**మంత్రి రజిని ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని ప్రత్తిపాటి ఎద్దేవా**

**కొండవీడు కోట అభివృద్ధిపై వైకాపా ప్రభుత్వానికి, రజినికి ప్రత్తిపాటి సెల్ఫీ ఛాలెంజ్**



**హైదరాబాద్(శుభ తెలంగాణ):**
కొండవీడు అగడ్తను మింగేసి మంత్రి రజిని రూ.20 కోట్ల దోపిడీకి పాల్పడ్డారని మాజీమంత్రి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. కొండవీడు కోట అభివృద్ధి పనులపై వైకాపా ప్రభుత్వానికి, మంత్రి రజినికి ప్రత్తిపాటి సెల్ఫీ ఛాలెంజ్ విసిరాలు. పుట్టకోట వద్ద మట్టి తవ్వకాలు, కొండవీడు కోట నగరవనం, ఘాట్ రోడ్ శిలాఫలకాల వద్ద ప్రత్తిపాటి సెల్ఫీ ది. కొండవీడు కోటపై లక్ష్మీనరసింహస్వామి, శివాలయాలను ప్రత్తిపాటి దర్శించుకున్నారు. అనంతరం వెదుళ్ల, ముత్యాలమ్మ చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడుతూ రాజధాని అమరావతి ప్రాంతంలో ప్రపంచ పర్యాటక కేంద్రం ఉండాలనే దూర దృష్టితో తెదేపా హయాంలో రూ.90 కోట్లతో కొండవీడు కోటను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. చంద్రబాబు ప్రత్యేక దృష్టితో కొండవీడు కోట ఘాట్ రోడ్, నగరవనం అభివృద్ధి చేసినట్లు తెలిపారు. వైకాపా పాలనలో కొండవీడు కోటపై చెత్త డబ్బాలు తప్ప మరేమీ కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. వైకాపా ప్రభుత్వ 4.3 ఏళ్లలో మంత్రి రజిని అధికారులతో కలిసి ఐదుసార్లు కొండవీడు కోటకు వచ్చి సోషల్ మీడియాలో హడావుడి చేశారే తప్ప ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. తెదేపా హయాంలో చేసిన అభివృద్ధి పనుల శిలాఫలకాలను ధ్వంసం చేయడం తప్ప మరేమీ చేయలేదని ఎద్దేవా చేశారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయం, శివాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశామని... విగ్రహాలను కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామని అన్నారు. మంత్రి రజిని కనీసం విగ్రహాలను కూడా ప్రతిష్ఠించలేకపోయారని ఆరోపించారు. కొండవీడు కోటపై రూ.20 కోట్ల అభివృద్ధి పనులకు చంద్రబాబు జీవో కూడా జారీ చేశారని... ఆ పనులను కూడా పూర్తి చేయలేకపోయారని ప్రత్తిపాటి విమర్శించారు. తెదేపా హయాంలో వివాదరహిత స్థలంలో విద్యుత్ ఉపకేంద్రం మంజూరు చేసి శంకుస్థాపన కూడా చేశామని... ఉద్దేశపూర్వకంగా కావాలనే ఆ స్థలాన్ని కాదని మరో చోటకు వివాదం చేశారన్నారు. కొండవీడు కోటపై విద్యుత్ సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన 3 ట్రాన్స్‌ఫార్మర్లను, దీపాలను కూడా తీసుకెళ్లారని.. అమ్ముకోవడానికి అవకాశం ఉన్న ప్రతి దాన్ని తీసుకెళ్లి విక్రయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండవీడు కోట అభివృద్ధికి మంత్రి రజిని చేసింది ఏమీ లేకపోయినా టోల్‌గేట్ పెట్టి రూ.10 రుసుము వసూలు చేసుకుంటున్నారని అన్నారు. ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉన్న కొండవీడు కోటపై పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ప్రత్తిపాటి తెలిపారు. కొండవీడు కోటను అభివృద్ధి చేయకపోగా కొండవీడు అగడ్తను మింగేసి రూ.20 కోట్ల దోపిడీకి పాల్పడ్డారని ప్రత్తిపాటి ఆరోపించారు. కొండవీడు అగడ్తలో 300 అడుగుల లోతున మట్టి తీసి అమ్ముకోవడం దారుణమని అన్నారు. తెదేపా ప్రభుత్వ హయాంలో కొండవీడు కోట అభివృద్ధి చేసిన గుత్తేదారులకు డబ్బులు కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారని తెలిపారు. మేం అభివృద్ధి పనులు చేసి శిలాఫలకాలు వేసుకుంటే వాటిని కూడా ధ్వంసం చేశారని... రేపు తెదేపా వచ్చాక వైకాపా వేయించుకున్న శిలాఫలకాలు ఉంటాయా అని ప్రత్తిపాటి ప్రశ్నించారు. తెదేపా హయాంలో ఎప్పుడూ శిలాఫలకాలు ధ్వంసం చేయలేదని.. ఎప్పుడూ లేనివిధంగా దుష్ట సంప్రదాయం తీసుకొచ్చారని ప్రత్తిపాటి వ్యాఖ్యానించారు. అభివృద్ధి చేయకపోగా అభివృద్ధి చేసిన వారి శిలాఫలకాలు మాత్రం ధ్వంసం చేస్తున్నారన్నారు. కొండవీడు కోటకు కావాల్సింది అభివృద్ధి అని... మంత్రి రజిని పర్యటనలు కాదని... ఆమె పర్యటనలతో ఒరిగిందేమీ లేదన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో తన హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నానని...వైకాపా పాలనలో మంత్రి రజిని చేసిన అభివృద్ధిపై చర్చకు వచ్చే ధైర్యముందా అని ప్రశ్నించారు. అభివృద్ధి అంటే శిలాఫలకాలు ధ్వంసం చేయడం, మట్టి అమ్ముకోవడం కాదన్నారు. కొండవీడు కోటపై చెక్‌డ్యాం మంజూరు చేయించానని... అది పూర్తయి ఉంటే ఈ ప్రాంతమంతా భూగర్భజలాలు పెరిగేవని.. పర్యాటకుల కోసం బోటు షికారు ఏర్పాటు చేసి పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలనుకున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో చంద్రబాబు ఉన్నప్పుడు భూముల ధరలు ఎలా ఉన్నాయో... ఇప్పుడు ఎలా ఉన్నాయో రైతులు కూడా ఆలోచన చేయాలన్నారు. దాదాపు 70 శాతం భూములు ధరలు పడిపోయాయని.. పేదవాడికి సాయం చేసే స్థితిగతులను కోల్పోయారని అన్నారు. యడ్లపాడు మండలంలో రోడ్లు అత్యంత అధ్వానంగా ఉన్నాయని... కనీసం యడ్లపాడు-ఫిరంగిపురం రోడ్డు కూడా వేయలేరా అని ప్రశ్నించారు. తన హయాంలో వేసిన రోడ్లు తప్ప మంత్రి రజిని వేసిన ఒక్క రహదారి అయినా ఉందా అని ప్రశ్నించారు. రహదారులు కూడా వేయించలేకపోయిన రజినికి మంత్రి పదవి ఎందుకని... సహజవనరులు కొల్లగొట్టడానికా?... వసూళ్లుకా? దోచుకోవడానికా? అని ప్రత్తిపాటి ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు చేసిన పనులు కూడా చేయలేకపోతున్న మంత్రి రజిని సిగ్గుపడాలని.. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో రజిని ఉన్నారని ప్రత్తిపాటి తెలిపారు.

## పల్నాడుజిల్లా అభివృద్ధి సమన్వయ పరిరక్షణ కమిటీ సమావేశం లో పాల్గొన్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్ నందు మంగళవారం నాడు జరిగిన పల్నాడుజిల్లా అభివృద్ధి సమన్వయ పరిరక్షణ కమిటీ సమావేశంలో శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ పాల్గొన్నారు. ఎంపీ శ్రీ లావు కృష్ణ దేవరాయలు , నరసరావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి , జిల్లా కలెక్టర్ శివశంకర్ పాల్గొన్న ఈ సమావేశంలో చిలకలూరిపేట బైపాస్ పనులు, రైతులకు ఇబ్బందిగా మారిన కాంపౌండ్ వాల్ నిర్మాణం గురించి చర్చించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రహదారుల అభివృద్ధి, అంతర్గత వంతెనలు నిర్మాణం, స్థలసేకరణ తదితర అంశాలపై సబంధిత శాఖల అధికారులతో సమీక్షలో చర్చించారు.పల్నాడు జిల్లా ఏర్పాటు అయిన తర్వాత రైల్వే స్టేషన్ లు అభివృద్ధి, రైల్వే లైన్ల నిర్మాణం, అంతర్గత వంతెనల నిర్మాణం పూర్తి, అందుబాటులో ఉన్న స్టేషన్ లకు అవసరమైన సహాయ సహకారాలు రైల్వే శాఖ అందించడం, రైల్వే గూడ్స్ షెడ్స్ అభివృద్ధి నరసరావుపేట రైల్వే స్టేషన్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందించిన పథకాలు తదితర అంశాలపై ఆయా శాఖల జిల్లా అధికారులతో చర్చించారు. ఖరీఫ్ పంట సాగు, విత్తనాల లభ్యత, ఎరువులు - పురుగుల మందులు కొరత రాకుండా చేపట్టవలసిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గతంలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, ప్రస్తుతం పరిస్థితుల్లో అటువంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి చైర్మన్ సాయి మార్కొండా రెడ్డి , జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సమీక్ష లో జిల్లా అధికారులకు, ఆయా కంపెనీలు ప్రతినిదులు, డీలర్లకు పలు సూచనలు చేశారు

## డిజిపి కార్యాలయం(ACB)



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** విశాఖపట్నం జిల్లా, అగనంపుడి గ్రామానికి చెందిన ఫిర్యాదిదారుడు మరియు బంధువుల ఇంటి పన్ను దరఖాస్తులను ప్రాసెస్ చేయడానికి రూ. 20,000/- రూపాయిలు లంచంగా విశాఖపట్నం జిల్లా, ప్రశాంతినగర్ సచివాలయ వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రెటరీ శ్రీ %ణ%. భాస్కరరావు బాధితుడిని డిమాండ్ చేయడంతో, ఫిర్యాదిదారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.
దీనిపైన కేసు నమోదు చేసుకున్న అధికారులు ఈ రోజు విశాఖపట్నం జిల్లా, ప్రశాంతినగర్ సచివాలయ వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రెటరీ శ్రీ %ణ%. భాస్కరరావు బాధితుడిని వద్ద నుండి 20,000 రూపాయలు లంచంగా తీసుకుంటుండగా విశాఖపట్నం రేంజ్ అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవడం జరిగింది. మరి కాసేపటిలో నిందిత ఆధికారిని అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరుస్తారు.
అవినీతి అధికారులపై ప్రజల ఫిర్యాదు కోసం 14400: అవినీతి నిరోధక శాఖ ప్రజల కోసం ప్రత్యేకంగా అందుబాటులో ఉంచిన 14400 నెంబర్ ను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, ఎవరైనా అధికారులు వేధింపులకు పాల్పడితే ప్రజలు ఈ నెంబర్ ద్వారా అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించ వచ్చని డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు.

## అవాక్కైనా వ్యాపారి అసలు ఏమైందంటే..?




**హైదరాబాద్(శుభ తెలంగాణ):** ప్రకాశం జిల్లా బేస్తవారిపేట కు చెందిన ఓ వ్యాపారి తన ఫోన్ పే కు నగదు బదిలీ చేయించుకుని అవాక్కయ్యాడు. ఓ అపరిచిత మహిళ వచ్చి తనకు నగదు అవసరం ఉందని తన ఫోన్ పే ద్వారా నగదు బదిలీ చేస్తానని నగదు కావాలని తెలిపింది. సదరు వ్యాపారికి మహిళా ఫోన్ పే ద్వారా 98 వేల రూపాయలు జమచేసి అతని వద్ద నగదు తీసుకొని వెళ్ళింది. తర్వాత రెండవ రోజు సదరు వ్యాపారి అకౌంట్ ను బ్యాంక్ అధికారులు హోల్డ్ లో పెట్టారు. నగదు బదిలీకి మహిళ ఉపయోగించిన మొబైల్ ఫోను తిరుపతిలో పోయినట్లుగా మొబైల్ ఫోన్ యజమాని పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టాడు. అంతేకాకుండా తన అకౌంట్ నుంచి నగదు మాయం అయిందని కంప్లైంట్ చేయడంతో బేస్తవారిపేటకు చెందిన వ్యాపారి అకౌంట్ ను పోలీసు అధికారులు హోల్డ్ లో పెట్టించారు. ఈ విషయం తెలుసుకున్న వ్యాపారి అవాకయ్యాడు. అపరిచిత వ్యక్తుల వద్ద నుండి కూడా ఇలా నగదు బదిలీ చేపించుకోకూడదని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## మున్సిపల్ కమిషనర్ కి వినతి పత్రం అందజేసిన:పేట బిఎస్పి పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ మూకిరి కోటి



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** చిలకలూరిపేట: పట్టణంలోని పురపాలక సంఘం మెప్మా విభాగంలో శ్రీనివాస్ అనే ఉద్యోగి అవకతవకలకు పాల్పడుతున్నాడని డ్వాక్రా మహిళలు, బిఎస్పీ పార్టీ చిలకలూరిపేట నియోజకవర్గ కన్వీనర్ మూకిరి కోటి దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ సందర్భంగా మూకిరి కోటి పురపాలక సంఘ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. మూకిరి కోటి మాట్లాడుతూ డ్వాక్రా మహిళల పరిస్థితులు అర్థం చేసుకొని శ్రీనివాస్ అనే ఉద్యోగి నిర్వహిస్తున్న కార్య చర్యలను, రికార్డ్స్ ను తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకోమని కమిషనర్ ను కోరారు.

Edited, Printed, Published & Owned by Sri N.C. Shekar.Corporate Office : Rama Krishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India.RNI-TELTEL/2017/72695,Editor :N.C.Shekar.Cell :7799911110.Email:subhatelangana@gmail. com